నేడు శాస్త్ర ప్రచార ఉద్యమం ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన శాస్త్ర ప్రచార ఉద్యమం ప్రారంభించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కుప్పిలి కామేశ్వరరావు, గొంటి గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. శాస్త్రవేత్తలు సి.వి.రామన్, క్యూరీ జయంతిలను పురస్కరించుకుని ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్వర్క్ (ఎఐపిఎస్ఎన్) పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జనవిజ్ఞాన వేదికగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శస్త్ర ప్రచార ఉద్యమం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28న జాతీయ సైన్సు దినోత్సవం వరకు నిర్వహిస్తామని చెప్పారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో, పట్టణాల్లో, గ్రామాల్లో, విశ్వవిద్యాలయాల్లో, డిగ్రీ కళాశాలల్లో, విద్యాలయాల్లో శాస్త్ర ప్రచార ఉద్యమాన్ని చేపడుతున్నామని, దీనిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

బూర్జ పిఎసిఎస్ భవనం

బూర్జ పిఎసిఎస్‌లో నిధుల అవకతవకల ఫలితంగా రైతులకు ఈ సంవత్సరం ఎరువులకు నోచుకోలేకపోయారు. తమ మండల పరిధిలోని రైతులకు కావాల్సిన ఎరువుల మేరకు మార్క్‌ఫెడ్‌కు పిఎసిఎస్ అధికారులు బ్యాంకు గ్యారంటీ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధికారులు వాటిని సమర్పించకపోవడంతో ఈ సంవత్సరం ఖరీఫ్‌లో ఎరవులు కేటాయింపులు జరగలేదు. దీంతో రైతులు ప్రయివేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకోంది.

వారి పాపం...
రైతులకు శాపం

- మార్క్‌ఫెడ్‌కు బ్యాంకు గ్యారంటీ ఇవ్వని పిఎసిఎస్ అధికారులు
- ఖరీఫ్‌లో ఎరువుల కేటాయింపు నిలిపివేత
- బూర్జ పిఎసిఎస్‌లో అవకతవకల ఫలితం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

బూర్జ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా రైతులను ఆదుకోవాల్సిన అధికారులు వారిని నట్టేట ముంచుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాము తీసుకున్న అప్పును పూర్తిగా చెల్లించినా రికార్డుల్లో తమ పేరున రుణం ఉండటం, వాయిదా సొమ్ములు చెల్లించినా జమ కాకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. అప్పు తీసుకోకపోయినా నోటీసులు ఇస్తుండటంతో రైతులు అవాక్కతున్నారు. దీనిపై ఇప్పటికే సహకార శాఖ అధికారులు విచారణ మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. తాము కట్టిన సొమ్ము జమ ఆందోళనలో ఉన్న రైతులకు పిఎసిఎస్ ద్వారా ఖరీఫ్‌లో మరో నష్టం వాటిల్లింది. పిఎసిఎస్ ద్వారా ఏటా ఏడాది ఎరువులు పొందిన రైతులకు ఈ సంవత్సరం నోచుకోలేకపోయారు. పిఎసిఎస్‌లకు అవసరమైన ఎరువులను వ్యవసాయశాఖ అధికారులు కేటాయిస్తారు. బ్యాంకు గ్యారంటీలు సమర్పించే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు మార్క్‌ఫెడ్ అధికారులు ఎరువులను కేటాయిస్తారు. ఈ సంవత్సరం బ్యాంకు గ్యారంటీలు సమర్పించకపోవడంతో ఎరువులు కేటాయింపులు జరగలేదు.

ప్రయివేట్‌గా కొనుగోళ్లు

పిఎసిఎస్ ద్వారా ఎరువులు అందించకపోవడంతో రైతులు ప్రయివేట్ డీలర్ల వద్ద కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. స్థానిక సచివాలయం ద్వారా అందించినా అవి చాలకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేశారు. గతేడాది ఖరీఫ్‌లో 80 మెట్రిక్ టన్నుల యూరియా, 60 మెట్రిక్ టన్నుల డిఎపి అందించారు. ఈ సంవత్సరం బ్యాంకు గ్యారంటీ ఇవ్వకపోవడంతో కేటాయింపులు జరగలేదని తెలుస్తోంది.

బ్యాంకు గ్యారంటీ ఇవ్వకపోవడానికి కారణమదేనా?

బూర్జ పిఎసిఎస్ పరిధిలో ఈ సంవత్సరం ఖరీఫ్‌లో ఎరువులు అందకపోవడానికి సొసైటీ పెద్ద మనిషే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిధుల అవకతవకలతో ప్రాథమిక పరపతి సంఘం పరపతి కోల్పోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పిఎసిఎస్ కరెంట్ ఖాతాలో తగినంత బ్యాలెన్స్ లేకపోవడం వల్ల సంబంధిత బ్యాంకు గ్యారంటీ ఇవ్వలేదని తెలుస్తోంది. ఆ డబ్బులను విత్ డ్రా చేశారన్న ఆరోపణలూ లేకపోలేదు. ఫలితంగా ఎరువులు కేటాయింపులు జరపకపోవడం, రైతులు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు తలెత్తాయి.

సొసైటీ ద్వారా ఎరువులు అందించలేదు

నేను ఎనిమిది ఎకరాలు కౌలుకు భూమి తీసుకుని వరి వేశాను. మొదటి విడత పది యూరియా బస్తాలు సచివాలయం ద్వారా అందించారు. రెండో సారి యూరియా లేకపోవడంతో ప్రయివేట్ డీలర్ల నుంచి బస్తా రూ.380లకు కొన్నాను. గతేడాది బూర్జ సొసైటీ ద్వారా ఎరువులు ఇచ్చారు. ఈ సంవత్సరం ఇవ్వలేదు.

- చక్కర రాములు, బూర్జ

ఎప్పుడూ ఇలా లేదు

సొసైటీ ఏర్పాటైన నాటి నుంచి ఎరువులు తీసుకుంటున్నాం. ఈ సంవత్సరం ఎరువులు ఇవ్వలేదు. సచివాలయం ద్వారా ఎకరాకు ఒక యూరియా బస్తాతో పాటు పురుగుల మందులు అంటగట్టారు. ఎరువులు రెండో సారి చల్లేందుకు ప్రయివేట్ దుకాణంలో రూ.370లకు కొనుగోలు చేశాను. సొసైటీలో ఎరువులు ఇస్తే ఈ ఇబ్బంది ఉండేది కాదు.

- బోరశెట్టి అప్పన్న, బూర్జ

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ అన్యాయం

- ఆందోళనలపై కేంద్రం స్పందించకపోవడం దుర్మార్గం
- ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు
- మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు సంఘీభావ దినం

ఆందోళన చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకపాత్ర వహిస్తున్న విశాఖ ఉక్కును ప్రయివేటీకరించాలని చూడటం అన్యాయమని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద సోమవారం సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమైక్య ఆధ్వర్యాన మోడీ ప్రభుత్వ రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక, కర్షక సంఘీభావ దినం సందర్భంగా చేపట్టిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు వెయ్యి రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నా... కేంద్రంలోని మోడీ ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. దేశంలో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు స్టీల్ ప్లాంట్లకు సొంత గనులు ఉన్నాయని, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు మాత్రం కేటాయించలేదని చెప్పారు. రూ.మూడు లక్షల కోట్లు విలువైన ఉక్కు కర్మాగారాన్ని చౌకగా దక్షిణ కొరియాకు చెందిన పోస్కోకు అదానీకి కారు చౌకగా అప్పగించేందుకు మోడీ శతవిధాలా ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజలు, కార్మికులు తీవ్రంగా ఉద్యమించడం వల్లే ఉక్కును ప్రయివేటీకరణం చేయడం వల్లే మోడీ ప్రభుత్వానికి సాధ్యం కాలేదన్నారు.

సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక, రైతు, ప్రజా ఉద్యమాలకు అండగా నిలుస్తూ, మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతు ఐక్య ఉద్యమానికి మద్దతుగా నిలబడిన న్యూస్ క్లిక్ వార్త ఛానల్‌పై మోడీ ప్రభుత్వం కక్ష కట్టిందన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటనా స్వేచ్ఛనూ మోడీ ప్రభుత్వం కాలరాసిందని విమర్శించారు. న్యూస్ క్లిక్ జర్నలిస్టులు ప్రవీణ్ పురకాయస్త, అమిత్ చక్రవర్తులపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేసి జైల్లో పెట్టిందన్నారు. జర్నలిస్టులపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించి వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు ఉద్యమాన్ని మోడీ ప్రభుత్వం జాతి వ్యతిరేకమైనది గాను, ఈ ఉద్యమానికి విదేశాల నుంచి, ఉగ్రవాదుల నుంచి నిధులు వస్తున్నాయని తప్పుడు ఆరోపణల ప్రచారాన్ని మోడీ ప్రభుత్వం మానుకోవాలన్నారు. కిసాన్ రైతు కాంగ్రెస్ నాయకులు ఎస్.అన్నాజీరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసి, రక్షణ రంగం, గనులను కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. ఎఐటియుసి నాయకులు చిక్కాల గోవిందరావు మాట్లాడుతూ కార్మిక హక్కులు కాలరాస్తూ పెట్టుబడిదారులకు కార్మికులను బానిసలుగా మార్చేందుకు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని చెప్పారు. అనంతరం న్యూస్ క్లిక్ ఎడిటర్, సిబ్బందిపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీని దహనం చేశారు. కార్యక్రమంలో కార్మిక రైతు సంఘాలు నాయకులు బి.కృష్ణమూర్తి, అల్లు సత్యనారాయణ, ఎన్.గణపతి, ఎం.ఆదినారాయణమూర్తి, హెచ్.ఈశ్వరరావు, కె.సూరయ్య, చంద్రశేఖర్, జి.అమరావతి, పి.గోపి, ఎం.రమణ, అశోక్, గోపాల్ పాల్గొన్నారు.

దోచుకోవడమే జగన్ లక్ష్యం

రౌండ్‌టేబుల్ సమావేశంలో టిడిపి నాయకుల ధ్వజం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చంద్రబాబు సొంత కాళ్లపై నిలబెట్టే సంక్షేమ పథకాలు అమలు చేస్తే... సిఎం జగన్మోహన్‌రెడ్డి ఆ కాళ్లు విరిచి కట్టు కట్టాడని అఖిల పక్ష నాయకులు విమర్శించారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అధ్యక్షతన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రూ.75 వేల కోట్ల బిసి సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించిన బిసిల ద్రోహి జగన్ అని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్‌టిఆర్, చంద్రబాబు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే... జగన్ 24 శాతానికి కుదించి 16,800 మందికి రాజ్యాంగబద్ధ పదవులను దూరం చేశారని విమర్శించారు. చంద్రబాబు బిసిలకు భూములు కొనుగోలు చేసి అందిస్తే జగన్ బిసిల నుంచి 8 వేల ఎకరాల

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

అసైన్డ్ భూములను బలవంతంగా లాక్కున్నారని ఎద్దేవా చేశారు. వైసిపి పాలనలో 74 మంది బిసిల హత్య, 800 మందిపై తప్పుడు కేసులు, మూడు వేల మందిపై దాడులకు పాల్పడ్డారరని అన్నారు. 13 బిసి భవనాలు, 1187 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు నిలిపివేశారన్నారు. 1998లో టిడిపి హయాంలో బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు పెడితే వాటి రద్దు కోసం సుప్రీం కోర్టుకు వెళ్లడం శోచనీయమన్నారు. మెరుగైన ఉద్యోగాల కల్పన లక్ష్యంగా విద్యోన్నతికి శిక్షణ ఇస్తే... జగన్ దానిని రద్దు చేశారని గుర్తు చేశారు. మరోవైపు స్కిల్ డెవలప్‌మెంట్ రద్దు చేసి ఉద్యోగాలు లేకుండా ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన చంద్రన్న పెళ్లికానుక, అన్న క్యాంటీన్లు, పండగ కానుకలు రద్దు చేశారని అన్నారు. ఇళ్ల పట్టాలు, ఒటిఎస్ పేరుతో పేదలను దోచుకున్నారన్నారు. టిడిపి పార్టీ ఆవిర్భావం తర్వాతనే బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా అవకాశాలు వచ్చాయన్నారు. చంద్రబాబు హయాంలో బడుగు, బలహీవర్గాల ప్రజలు ఆర్థికంగా పురోభివృద్ధి చెందాలనే లక్ష్యంతో పారిశ్రామిక రాయితీలిచ్చి పారిశ్రామిక వేత్తలను చేశారన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కాంట్రాక్టులన్నీ సొంత వర్గానికి కట్టబెట్టి బడుగులను అణగదొక్కుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ఇసుక మొత్తాన్ని జెపి వెంచర్సుకు కట్టబెట్టారని, మద్యం కాంట్రాక్టర్లను విజయసాయిరెడ్డి బంధువులకు అప్పగించారని అన్నారు. ముందుగా మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, ఐగ్గ రమణమూర్తి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గౌతు శిరీష, సింతు సుధాకర్, బిసి సెల్ అధ్యక్షులు కలగ జగదీష్, ప్రధాన కార్యదర్శి, గోవింద పాపారావు, పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి పిరుకట్ల విఠల్, రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్, మాదారపు వెంకటేష్, బోయిన గోవిందరాజులు, దామోదర నరసింహులు, గురుమూర్తి, పూరి కోటేశ్వరరావు, తమ్మిన విజయకుమార్ పాల్గొన్నారు.

జనవరి నుంచి కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు

వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎం జగన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జగనన్న ఆరోగ్య సురక్ష 5వ దశ డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి చేసి జనవరిలో కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను జారీ చేయాలని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్య సురక్షణ శిబిరాల్లో ఇప్పటి వరకు నాలుగు దశల్లో పట్టణ పరిధిలో 24,892, గ్రామీణ ప్రాంతంలో 2,42,448 ఔట్ పేషెంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కొత్తగా హైపర్ టెన్షన్ 13,997, డయాబెటిస్ (సుగర్) 7,500, టిబి-31, లెప్రసీ 497 కేసులను గుర్తించినట్లు వెల్లడించారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫరల్ 5,216 మందిని పంపించామన్నారు. వాటిలో కేటరాక్ట్ ఆపరేషన్లకు 2,554, స్పెక్టకల్స్‌కు

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, డిఎంహెచ్‌ఒ

2,389 మందిని రిఫరల్‌కు పంపించినట్లు వివరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ పొగిరి ప్రకాశరావు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ శాంతిశ్రీ పాల్గొన్నారు.

నేడు సామాజిక సాధికార యాత్ర

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు పట్టణంలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రలో నియోజకవర్గంలోని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. పట్టణంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో సామాజిక సాధికార విప్లవం నడుస్తుందన్నారు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఏకమై సామాజిక సాధికార విజయ శంఖారావం పూరించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు చెందిన ప్రజలు ఈ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముందుగా పట్టణ శివారున ఫ్లై ఓవర్ వద్ద ఉన్న వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి

మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

నివాళ్లర్పిస్తామని అన్నారు. అక్కడ నుంచి ర్యాలీగా వచ్చిన ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పిస్తామని తెలిపారు. ప్రధాన రహదారి నుంచి సభా ప్రాంగణానికి చేరుకొని అశేష జనవాహిని మధ్య మంత్రులు ప్రసంగిస్తారని అన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, మాజీ పట్టణ యువజన అధ్యక్షుడు ముత్తా విజయ్, సనపల మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

దళిత ద్రోహి సిఎం జగన్

ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులు, వేధింపులు ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు విమర్శించారు. దళిత పక్షపాతి అని చెప్పుకొని తిరుగుతున్న సిఎం జగన్.. దళిత ద్రోహి అని ఆరోపించారు. రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులపై స్పందించిన ఆయన స్థానిక క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం విలేకరులతో మాట్లాడారు. కోవిడ్ సమయంలో వెనకబడిన తరగతికి చెందిన వ్యక్తి అనే కారణంతోనే డాక్టర్ సుధాకర్‌పై పిచ్చివాడిగా ముద్ర వేసి, చనిపోయేలా? చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ మద్యం విధానంపై ప్రశ్నించిన వ్యక్తి మూడో రోజుల్లో అనుమానాస్పదంగా శవమై తేలడం దారుణ స్థితికి నిదర్శనమన్నారు. అదే వైసిపికి చెందిన ఎమ్మెల్సీ అనంతబాబు దళితుడైన తన డ్రైవర్ చంపి, ఇంటికి పంపిస్తే.. ప్రభుత్వం ఏ విధంగా చేతులు దులుపుకుందో, విడుదలయ్యాక జరిగిన సంబరాలను అంతా చూశామని అన్నారు. నీరు అడిగిన యువకుడిపై మూత్రం పోయడం... ఇలా ప్రతి విషయంలోనూ ముఖ్యమంత్రి స్పందన ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. జాతీయ నేర గణాంకాల నివేదిక ప్రకారం రాష్ట్రంలో ఆరు వేలకు పైగా అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని గుర్తుచేశారు. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ సైతం

రామ్మోహన్ నాయుడు, ఎంపీ

ప్రభుత్వ పెద్దల ఒత్తిడికి తలొగ్గాల్సి రావడం విచారకరమన్నారు. ఆంధ్రాలో భారత రాజ్యాంగం అమలు కావడం లేదని, జగన్ సొంత చట్టాలు అమలవుతున్నాయని దుయ్యబట్టారు. ఇకన్నైనా దళిత పక్షపాతి ప్రకటనలు, సవతి ప్రేమ విరమించుకోవాలని స్పష్టం చేశారు. వెనుకబడిన తరగతులకు అండగా నిలిచిన పార్టీ తెలుగుదేశం మాత్రమే అని వివరించారు. ఇప్పటికైనా దళితులపై దాడులను ప్రభుత్వం అడ్డుకోవాలని, బాధితులకు న్యాయం జరిగేలా నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

23న సిఎం రాక

- కిడ్నీ ఆస్పత్రి, పరిశోధన కేంద్రం ప్రారంభం
- మంత్రి అప్పలరాజు వెల్లడి

ప్రజాశక్తి- పలాస

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 23న జిల్లాకు రానున్నారని మత్స్య, పశు సంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తెలిపారు. పలాసలో నిర్మిస్తున్న కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, పరిశోధక కేంద్రాన్ని ఆ రోజు ప్రారంభిస్తారని చెప్పారు. ఈ మేరకు సోమవారం పార్టీ శ్రేణులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయమయ్యేందుకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని సూచించారు.

టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

పలాసలో ఈ నెల 5న నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతమయ్యిందని తెలిపారు. కార్యకర్తల్లో మంచి జోష్ ఉందని, ఎన్నికల వరకు కొనసాగించాలని కోరారు.

బావాజీ మఠం భూములను పరిరక్షించాలి

- సాగునీరు ఇవ్వాలని రైతులు వినతి
- మ్యుటేషన్ జారీలో జాప్యంపై ఫిర్యాదు
- స్పందనలో వినతులను స్వీకరించిన జెసి నవీన్

వినతులను స్వీకరిస్తున్న జెసి నవీన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆమదాలవలస మండలం అక్కివరం-తోటాడ గ్రామాల్లో ఉన్న బావాజీ మఠం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని పరిరక్షించాలని కొర్ను పాపారావు, బి.వి.రవి, మఠం ఉత్తరాధికారి లక్ష్మణదాస్‌లు ఫిర్యాదు చేశారు. ఈ భూముల్లో ఆక్రమణలు తొలగించాలని వినతిపత్రాలను అందజేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో జాయింట్ కలెక్టర్ ఎ.నవీన్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నగర పరిధిలో పేదలకు ప్రభుత్వం ఇస్తున్న 90 రోజుల జగనన్న ఇళ్ల పట్టాల జారీలో తహశీల్దార్ కార్యాలయం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పట్టా కోసం దరఖాస్తు చేసుకున్న 522 మందిలో 160 మందికి మాత్రమే పట్టాలిచ్చి మిగిలిన వారికి పట్టాలు ఇవ్వకుండా నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని నగరానికి చెందిన బి.వి.ఎస్.రాజు ఫిర్యాదు చేశారు.కొత్తూరు మండలం నివగాంలో భూముల మ్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని భగవతిరావు ఫిర్యాదు చేశారు. నందిగాం మండలం హరిదాసుపురం, కణితూరు తదితర గ్రామాల్లో అనర్హులుగా చూపిస్తూ పింఛన్లు తొలగించారని, వాటిని పునరుద్ధరించాలని ఎంపిటిసి శ్యామలరావు ఫిర్యాదు చేశారు. ఎచ్చెర్ల మండలం దుప్పలవలసలో తాతల నాటి సర్వే నంబరు 185లోని ఆరు సెంట్లు ఇంటి స్థలంలో ఇళ్లు నిర్మించుకునేందుకు స్థానికులు అడ్డు కుంటున్నారని, రెవెన్యూ, పోలీస్‌శాఖల సహకారంతో ఆ స్థలాన్ని ఇప్పించాలని సీర పద్మ ఫిర్యాదు చేశారు. జిల్లా వ్యాప్తంగా వ్యక్తిగత, సామాజిక అవసరాలు పరిష్కరించాలని కోరుతూ స్పందనలో 320 వినతులు అందజేశారు. సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, ఇంఛన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితర శాఖలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. అనంతరం జరిగిన సమావేశంలో జెసి మాట్లాడుతూ వచ్చిన వినతులను పరిష్కరించడంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలకు సేవకులుగానే భావించి జవాబుదారీగా పనిచేయాలన్నారు. వినతులు ఇచ్చిన లబ్ధిదారులు సంతృప్తి చెందేలా అధికారులు ఇచ్చిన సమాధానం ఉండాలన్నారు. ఒకే అంశంపై తరచూ ఫిర్యాదులు రావడానికి గల కారణాలు పరిశీలించి లబ్ధిదారులకు సమగ్ర సమాచారంతో కూడిన సమాధానం ఇవ్వాలన్నారు. స్పందనలో డిఆర్‌ఒ గణపతిరావు, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, డెప్యూటీ కలెక్టర్ జయదేవి వినతులను స్వీకరించారు. వారిలో పాటు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఆర్.వెంకటరామన్, గృహనిర్మాణ సంస్థ పథక సంచాలకులు ఎన్.గణపతి, జిల్లా ఉద్యానవన అధికారి ఆర్.వి.వరప్రసాదరావు, జిల్లా సరఫరాల అధికారి డి.వి.రమణ, సమగ్ర శిక్షా అదనపు పథక సమన్వయకర్త డాక్టర్ ఆర్.జయప్రకాష్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి.చిట్టిరాజు పాల్గొన్నారు.

హాస్టళ్ల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలోని హాస్టళ్లలో ఉన్న విద్యార్థులు దోమల వల్ల ఇబ్బందులుపడుతున్నారని, వారికి నెట్‌లు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రాజు జెసి నవీన్‌కు వినతిపత్రం అందజే శారు. వార్డన్లే తమ సొంత డబ్బులు పెట్టి వాష్ రూమ్స్ శుభ్రం చేయిస్తున్నారని అన్నారు. చిన్న చిన్న మరమ్మతులకు, మెయింటినెన్స్ నిధులు విడుదల చేయాలని విన్నవించారు. అలాగే హాస్టళ్ల ల్లోకు ఎక్కువగా కుక్కలు వస్తున్నాయని, వాటి వల్ల విద్యార్థులు పడుతున్నారని వివరించారు. అలాగే నగరంలోని బిసి-1 హాస్టల్ పక్కన కిచెన్‌కు దగ్గరగా డ్రెయినేజీ ఉందని, దీంతో విద్యా ర్థులు అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు. వెంటనే డ్రెయినేజీని మూసివేయాలని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలకు అనుకూలంగా మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.

మహారాజ శ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్య సముఖమునకు.
IA. 83/2022 in OS 39/2022. మరియు OS.39/2022

Between: పిడుగు రాంబాబు
--పిటీషనర్/వాది
And: పొట్నూరు. శ్రీనివాసరావు వగైరాలు
--రెస్పాండెంట్/ప్రతివాదులు

To, పొట్నూరు శ్రీనివాసరావు, S/o లేటు సూర్యనారాయణ, 42 సం॥, డోర్ నెం. 1-1, పొందూరు గ్రామం మరియు మండలం, శ్రీకాకుళం జిల్లా.
1వ - రెస్పాండెంట్/1 వ ప్రతివాది.

పై నెంబరు దావా లో వాది అయిన పిడుగు రాంబాబు మీ పైన ప్రోనోటు పైకం రాబట్టే నిమిత్తం పై కోర్టులో ప్రోనోటు దావాను దాఖలు చేయగా సదరు దావాలో మీ హాజరు నిమిత్తం **తే10-11-2023దిన పై కోర్టులో వాయిదా అయి ఉన్నది.** సదరు వాయిదా నాడు మీరు గాని మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియపరుచుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు దావాను తీర్మాణించబడును.

// కోర్టు వారి ఆదేశాలతో //

**డోల. కిరణ్ బాబు
వాది తరుపు న్యాయవాది,
పొందూరు.**

జగన్ పాలనంతా అరాచకమే

కంచిలి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

ప్రజాశక్తి- కంచిలి

రాష్ట్రంలో నాలుగున్నరేళ్ళ జగన్ పాలనంతా అరాచకమేనని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్ అన్నారు. మండలంలో ఒరియా నారాయణపురం గ్రామంలో సోమవారం భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన కొనసాగుతుందన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై అక్రమంగా కేసులు పెట్టడం, బెదిరింపులకు పాల్పడడమే జరుగుతుందన్నారు. చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. మీ బిడ్డల భవిష్యత్ బాగుండాలంటే రానున్న ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును సిఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాదిన రామారావు, జగదీష్ పట్నాయక్, టివి రమణ, బంగారు, రమేష్, రవి, ఎం.పట్నాయక్, శోభన్ పాల్గొన్నారు.

కొత్తూరు : కరపత్రాలు పంపిణీ చేస్తున్న సాగర్

కొత్తూరు: మండలంలో గొట్టిపల్లి పంచాయతీలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం డిటిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ ఇంటింటికి వెళ్లి మినీ మేనిపెస్టోకు సంభంధించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జి.కమలాకర్, బి.గోవిందరావు, సవర మోహనరావు, పి.గోవిందా, రవికుమార్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలో మునగవలస గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోరుకొండ వెంకటరమణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ఆరోగ్యాంధ్రకు పునాది 'సురక్ష'

ప్రజాశక్తి- పలాస

ఆరోగ్యాంధ్రాకు పునాది జగనన్న ఆరోగ్య సురక్షని రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. సోమవారం మండలం బైరిసారంగపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ ప్రజా ఆరోగ్య వ్యవస్థ కోసం ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు వెచ్చిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే రాష్ట్రం కూడా ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇంటింటికి ఆరోగ్య సర్వే నిర్వహించి గ్రామాల్లోకి వైద్యులను పంపించి ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలని ప్రభుత్వం చూస్తుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా భవిష్యత్‌లో ప్రతి ఒక్కరికి సత్వర సేవలు అందించే అవకాశముంటుందని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రట్టి లింగయ్య సరస్వతి, ఎంపిపి డొక్కరి దానయ్య. తహశీల్దార్ బి.పాపారావు, ఎంపిడిఒ వి. తిరుమలరావు, వైసిపి జిల్లా కార్యదర్శి దల్లి జానకిరావు, మండల పార్టీ అధ్యక్షులు అగ్గున సూర్యారావు, చింతాడ గణపతి, అందాల శేషగిరి, బాడ జగన్నాయకులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం అందజేస్తున్న జగదీశ్వరరావు

గోల్డ్ మెడల్ విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ట్రిబుల్ ఐటిలో మొదటి సంవత్సరం చదువుతున్న సిహెచ్.పల్లవి ఫెన్సింగ్ పోటీలో గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. దీంతో డైరెక్టర్ ప్రొఫెసర్ జగదీశ్వరరావు సోమవారం అభినందనలు తెలియజేశారు. ఈ నెల 1న నంద్యాలలో జరిగిన ఫెన్సింగ్ పోటీలో పాల్గొని వ్యక్తిగత, టీం విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ నెల 19న జమ్మూకాశ్మీర్‌లో జరగనున్న నేషనల్ ఫెన్సింగ్ అర్హత సాధించింది. కార్యక్రమంలో పీడీ రాజు, దిలీప్ కుమార్, ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, డాక్టర్ శ్రీనివాసరావు, డీన్ వెల్ఫేర్ రవి పాల్గొన్నారు.

చేప పిల్లలను పంపిణీ చేస్తున్న స్పీకర్ సీతారాం

గిరిజనుల అభ్యున్నతే ధ్యేయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా సిఎం జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సోమవారం గిరిజన మత్స్యకారులకు స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద స్పీకర్ చేతులమీదుగా చేప పిల్లలను పంపిణీ చేసారు. బూర్జ మండలానికి చెందిన గిరిజన మత్స్యకారులకు లక్షా 39 వేల చేప పిల్లలను, సరుబుజ్జిలి మండల గిరిజన మత్స్యకారులకు ఆరువేల చేప పిల్లలను ఎస్‌టి సబ్‌ప్లాన్ పథకంలో భాగంగా అందించారు. కార్యక్రమంలో ఎపిడి రాధ, ఎఫ్‌డిఒ సురేష్ కుమార్, సచివాలయ సిబ్బంది, మత్స్యకారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

క్రీడల్లో గెలుపు, ఓటమి సహజమని విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని జడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు అన్నారు. గోవిందపురం ఉన్నత పాఠశాలలో కబడ్డీ విభాగంలో మండలస్థాయి గ్రిగ్స్ పోటీలు సోమవారం నిర్వహించారు. కబడ్డీ బాలుర సీనియర్స్ పాతటెక్కలి ఉన్నత పాఠశాల, అక్కుపల్లి ఎంజెపి రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్స్‌లో నగరంపల్లి, డోకులపాడు ఉన్నత పాఠశాలలు గెలుపొందాయి. అదే విధంగా బాలికల విభాగం సీనియర్స్‌లో వజ్రపుకొత్తూరు, డోకులపాడు ఉన్నత పాఠశాలలు, బాలికల జూనియర్స్‌లో వజ్రపుకొత్తూరు, దేవునల్తాడ పాఠశాల జట్లు గెలుపొందాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. క్రీడల్లో రాణించిన వారికి అదనపు అర్హత ఉన్నత చదువులకు అవకాశం ఉంటుందన్నారు. క్రీడలు కూడా చదువులో భాగంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో యువజన నాయకుడు పాలిన ఉమామహేశ్వరరావు, ఎంఇఒలు దశరథరావు, తవిటయ్య, హెచ్‌ఎం కె.హరిబాబు, పిఇటి ఎం.నాగరాజు, జిల్లా వ్యాయామాధికారి తవిటయ్య, పైల గజేంద్ర, పద్మలోచన, చంద్రశేఖర్, కణితి భగవాన్ పాల్గొన్నారు.

నేడు నృత్య ప్రదర్శన పోటీలు

కృష్ణారావు

సోంపేటం :కామ్రేడ్ గంటి రాజేశ్వరరావు 71వ వర్ధంతి పురస్కరించుకుని బారువ చాట్లబజార్ వద్ద మంగళవారం నృత్య ప్రదర్శన పోటీ నిర్వహించనున్నట్లు స్మారక సభ కమిటీ నాయకుడు దుంపల కృష్ణారావు తెలిపారు. గ్రూపు, డ్యూయెట్, సోలో విభాగాల్లో జానపద, ఉద్యమ గీతాల నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు సాయంత్రం 4 గంటలకు వేదిక వద్దకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు దుంపల కృష్ణారావు 9440833392, తొందర చిరంజీవి 9704201058, భాస్కర బడిత్య 9397667363లను సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించే అక్టోబర్ విప్లవసభ ప్రజలంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. మాకనపల్లికి చెందిన అమ్మ రామకృష్ణచే నేటి రైతు ఏకపాత్రాభినయ ప్రదర్శన జరపనున్నట్లు తెలిపారు.

భోజన వితరణ

శ్రీకాకుళం అర్బన్ : కీర్తిశేషులు కొంక్యాన శాంతమ్మ 19వ వర్ధంతి సందర్భంగా ఆమె భర్త కొంక్యాన రాధాకృష్ణ, కుమారుడు శివశంకర్, కుటుంబ సభ్యులు మురళీధర్, వేణుగోపాల్, మంగమ్మ, సరోజ ఆధ్వర్యాన నగరంలోని మదర్ థెరిసా హోమ్‌లో భోజన వితరణ నిర్వహించారు. హోమ్‌లో వికలాంగులకు, వృద్ధులకు ఆహార పదార్థాలు అందించారు. సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి శృతి

విధులను సక్రమంగా నిర్వర్తించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

విధులను బాధ్యతాయుతంగా, సక్రమంగా నిర్వర్తించాలని డిఎస్‌పి వై.శృతి అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు దస్త్రాలపై సంతకాలు చేశారు. అనంతరం మంగళవారం జరగనున్న బస్సుయాత్ర ప్రాంతాన్ని పరిశీలించారు. పట్టణ ప్రధాన రహదారిలో నిర్వహించనున్న బస్సుయాత్రకు ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసులు విధులు నిర్వహించే విధంగా ప్రణాళిక తయారు చేయాలని సిఐ పైడయ్యను ఆదేశించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని పార్కింగ్ స్థలం కోసం పరిశీలించారు. ఈమె వెంట ఎస్‌ఐ వై.కృష్ణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మధుబాబుకు ఘన సన్మానం

ప్రజాశక్తి- పలాస

మండలం బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న మధుబాబు ఇటీవల అమెరికా రాజధాని వాషింగ్టన్ డిసిలో ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా సుమారు 6 వారాల పాటు నార్త్ కరోలినాలో గల గ్రీన్స్ యూనివర్శిటీలో శిక్షణ పొంది ఫుల్ బ్రైట్ టీచింగ్ ఎక్సలెన్స్ అచీవ్మెంట్ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఇటీవల స్వదేశం చేరుకొని విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో మధుబాబును ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కె.వైకుంఠరావు మాట్లాడుతూ అమెరికాలో నేర్చుకున్న ఆంగ్ల నైపుణ్యాలను విద్యార్థులకు అందించి వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

కోర్టు విధులు బహిష్కరణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

కోర్టు పిటీషన్లు అన్నింటిపై రూ.20 విలువ గల వెల్ఫేర్ స్టాంపును అతికించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తీసుకున్న నిర్ణయంపై న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి భాయ్ ఆధ్వర్యంలో సోమవారం కోర్టు విధులను బహిష్కరించి నినాదాలు చేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ న్యాయవాదుల హక్కులు కాలరాస్తూ తీసుకున్న నిర్ణయం పై ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులు రూ.20 విలువ గల వెల్ఫేర్ స్టాంప్‌ను ఎటువంటి పిటిషన్లపై అతికించవద్దని పిలుపునిచ్చారు. హక్కులను కాలరాస్తూ తీసుకున్న నిర్ణయంపై నవంబర్ 6 నుంచి 11 వరకు కోర్టు విధులను బహిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పైడి వరాహ నరసింహం, బొడ్డేపల్లి మోహనరావు, హనుమంతు అచ్చెన్నాయుడు, వాడవలస రాజేశ్వరరావు, గురుగుబెల్లి ప్రభాకరరావు, అన్నెపు సత్యం పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

రణస్థలం రూరల్: పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని మండలంలో తిరుపతిపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆర్.ఇందుమతి అన్నారు. మాజీ సర్పంచ్ మండల రాము నాయుడు రూ.25 వేలు విలువల గల పార్కింగ్ టైల్స్‌ను తన సొంత నిధులతో గ్రామంలో ఉన్న పాఠశాల అభివృద్ధికి పాటు పడుతున్నారన్నారు. అనంతరం రామునాయుడు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న పాఠశాలలకు తనవంతు సహకారం అందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆకుల రమేష్, రామారావు, చిన్నంనాయుడు, తిరుమలరావు పాల్గొన్నారు.

ఎస్‌పి స్పందనకు 30 అర్జీలు

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

శ్రీకాకుళం : స్పందనలో వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమయంలోగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించేందుకు నిర్వహించిన స్పందనలో 30 ఫిర్యాదులను స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదిదారులు తమ తమ అభ్యర్థనలను రాతపూర్వకంగా విన్నవించుకున్నారు. అనంతరం ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మోసపూరితమైన 2, కుటుంబ తగదాలు 4, ఆస్తి తగాదాలు ఆరు, పాత ఫిర్యాదులు 3, ఇతరులు 15 వచ్చాయి. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, అడిషనల్ ఎస్‌పి జె.తిప్పేస్వామి పాల్గొన్నారు.

సాంఘిక గురుకులం సందర్శన

శ్రీకాకుళం రూరల్ మండలంలోని పెద్దపాడు అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను ఎస్‌పి జి.ఆర్.రాధిక సందర్శించారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులతో కలిసి తరగతి, వసతి గదులను పరిశీలించారు. సిసి కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. విద్యార్థులతో మమేకమై తగు సూచనలు చేశారు. ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో విద్యాభ్యాసించాలన్నారు. చదువుతోపాటు ఆటల్లోనూ ప్రతిభ చూపించాలన్నారు. పాక్సో, దిశ వంటి మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈమెతో పాటు ప్రిన్సిపాల్ జ్యోతి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

'తమ్మినేని'పై సిబిఐ విచారణ చేపట్టాలి

విలేకరులతో మాట్లాడుతున్న బి.వి.రామ్

ఆమదాలవలస :వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటివరకు స్పీకర్ తమ్మినేని సీతారాం చేసిన భూదందాలపై సిబిఐ విచారణ చేపట్టాలని రాష్ట్ర తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఇటీవల మండలంలోని తోటాడ రెవెన్యూ గ్రామంలో జగన్నాథ స్వామి బాలాజీ మఠం భూముల వివాదంలో ఉన్న స్థలాలను టిడిపి నాయకులతో కలిసి పర్యటించారు. అనంతరం పట్టణంలో టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి నాయకుల భూదందాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుందని, చివరకు మఠం భూములను సైతం నకిలీ డాక్యుమెంట్లతో కాజేయాలని చూసిన స్పీకర్, భార్య, కుమారుడుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ స్పీకర్ పదవికే కళంకం తెచ్చిన తమ్మినేని సీతారాంతో పాటు ఆయన కుటుంబసభ్యులు నియోజకవర్గంలో సుమారు వేయి కోట్ల భూ దందాలు చేశారన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే తోటాడ రెవెన్యూ పరిధిలో ఉన్న 200 ఎకరాల బావాజీ మఠం భూములు, 200 ఎకరాల కెఎల్‌ఎన్ భుక్త భూముల ఆక్రమణలపై తమ్మినేని కుటుంబం చేసిన తప్పుడు రిజిస్ట్రేషన్‌పై, అక్రమాలపై సిబిఐ ఎంక్వయిరీ కోరాలని డిమాండ్ చేశారు. స్పీకర్ చేస్తున్న మొత్తం అవినీతిపై దర్యాప్తు చేసి వెంటనే ఆయనను పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలుగు యువత అధికార ప్రతినిధి బొల్లినేని వెంకటేశ్వర్లు, తెలుగు యువత నాయకుడు కూన సంజీవరావు ఉన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి- నందిగాం

నందిగాం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని మండల టిడిపి ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ముందుగా పార్టీ కార్యాలయం నుండి పార్టీ నాయకులు పెంటపూరుల్లో బైక్ ర్యాలీ చేపట్టి అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గడిచిన 80 రోజులుగా వర్షాలు లేకపోవడంతో సాగుచేసిన వరిపైరు పూర్తిగా నాశనమైందని, తక్షణమే మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతాంగాన్ని పూర్తిస్థాయిలో ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు అజయ్ కుమార్ మాట్లాడుతూ నాయకులు అబద్దాలతో సరిపెట్టుకోకుండా చిత్తశుద్ధితో పనిచేసి రైతులకు పూర్తిస్థాయిలో సహకారం అందేలా చూడాలన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ వై.వి.పద్మావతికి అందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోలాకి చంద్రశేఖరరావు, సబ్బి జానకిరామ్, కొన్ని ప్రసాదరావు, లోకనాథం, సలాన కృష్ణారావు, లక్ష్మణరావు, మహేష్ ఉన్నారు.

సిపిఐ ఆధ్వర్యాన...

నందిగాం : ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

టెక్కలి : ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు కారణంగా రైతులు కరువు బారిన పడ్డారని, టెక్కలి నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని సిపిఐ నాయకులు, జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామమూర్తి, ఎపి రైతు సంఘం జిల్లా కన్వీనర్ గుడ్ల రామకృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వర్షాధారిత ప్రాంతాలతో పాటు కాలువ చివరి భూములకు కూడా సాగునీరు ఆందలేదన్నారు. దీంతో వరి పంటలు ఎండిపోతున్నాయన్నారు. అదే విధంగా పంటల భీమా పథకాన్ని వర్తింపజేయాలని, ఎకరాకు రూ.30 వేలు చొప్పున నష్టపరిహారం ఆందించాలని డిమాండ్ చేశారు. వీరితో పాటు నాయకులు పి.ధర్మారావు, చిక్కాల గోవిందరావు, తమిరి భుజంగరావు, గుడ్ల ఎర్రయ్య, తవిటినాయుడు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులు అమ్మకం

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అరటి, బీర, బెండ, కాకర, గుమ్మడి, జునుములు, ఆర్గానిక్ బెల్లం, కొర్ర, చోడి అమ్మకం చేపట్టారు. ఎంపిడిఒ ఎం.పావని అరటి పండ్లను కొనుగోలు చేశారు. అలాగే వచ్చే శుక్రవారం కూడా అమ్మకాలు చేపడతామన్నారు. ఈ ఉత్పత్తులను కొనుగోలు చేసిన వారిలో కలిగాం సర్పంచ్ సనపల కొటేశ్వరరావు, ఇరపాడు మాజీ ఎంపిటిసి కొయిలాపు సంజీవురావు, వ్యవసాయ సిబ్బంది చినమ్ముడు, గోవింద, ఎస్.వెంకటరావు, రమణయ్య, శ్రీలత, భూదేవి, మాధవి ఉన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న మంత్రి ప్రసాదరావు

నరసన్నపేట : వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

రణస్థలం : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజా సంకల్పయాత్ర సంబరాలు

సిఎం జగన్మోహనరెడ్డికి రాజ్యాధికారాన్ని తెచ్చి పెట్టిన ప్రధాన ఆయుధం ప్రజా సంకల్పయాత్ర. ప్రతిపక్షంలో ఉన్నా చట్టసభల ముఖం చూడకుండా ప్రజల మధ్యే గడపాలన్న సంకల్పం ఆయనను సుదీర్ఘకాలం పాటు ప్రజల మధ్యే ఉండేటట్టు చేసింది. ఈ యాత్ర వల్ల ఆయన గ్రామగ్రామన పర్యటించగలిగారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. 2014 ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాల్లో 151 స్థానాలను దక్కించుకున్నారు. ఆరేళ్ల క్రితం నాటి జగన్ చేపట్టిన ప్రజా సంకల్పయాత్రను గుర్తు చేసుకుంటూ జిల్లాలోని వైసిపి నాయకులు సంబరాలు నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కేకులు కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. నగరంలోని టౌన్ హాల్‌లో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, నరసన్నపేటలో ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ పాదయాత్రలో గుర్తించిన అంశాలను, పాలనకు అనుగుణంగా పలు సంస్కరణలకు దారి తీశాయన్నారు. చట్టాల్లో సవరణలు చేస్తూ నీతివంతంగా పాలన అందిస్తున్నారని అన్నారు. ప్రజల కష్టాలను తెలుసుకోవడమే కాకుండా నిరంతరాయంగా వాటి పరిష్కారానికి ఆలోచన చేశారన్నారు.

\- ప్రజాశక్తి, జిల్లా విలేకరుల యంత్రాంగం

ఇచ్ఛాపురం : కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు

కొత్తూరు : కేక్ తినిపిస్తున్న శ్రీకాంత్

నందిగాం : దుప్పట్లను అందజేస్తున్న నాయకులు

కోటబొమ్మాళి : నినాదాలు చేస్తున్న నాయకులు

నౌపడ : సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

టెక్కలి రూరల్ : కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు

రైలు ఢీకొని వివాహిత మృతి

లీలారాణి (ఫైల్)

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌లో సోమవారం ఉదయం పలాస-విశాఖపట్నం డిఎంయు రైలు ఢీకొని పట్టణంలోని చంద్రయ్యపేటకు చెందిన వివాహిత అనంత పట్నాయకుని లీలారాణి(48) మృతి చెందినట్లు జిఆర్‌పి పోలీసులు తెలిపారు. సోమవారం ఉదయం విశాఖపట్నం వెళ్లేందుకు రైల్వే ప్లాట్‌ఫామ్‌కు వెళ్తున్న క్రమంలో రైల్వే పట్టాలు దాటుతుండగా అప్పుడే స్టేషన్‌కు వస్తున్న డిఎంయు పాసింజర్ వెనుక నుండి వస్తున్న విషయాన్ని గ్రహించకపోవడంతో రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ప్రస్తుతం లక్ష్మీనగర్ సత్యసాయి భజనమండలిలో యువతులకు టైలరింగ్ శిక్షణను ఇస్తున్నారు. ఆమె భర్త గజపతి మండలంలోని ఆకులపేట ఉన్నత పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సంఘటనపై జిఆర్‌పి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

రమణ (ఫైల్)

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలో కొండములగాం పంచాయతీ ముక్తుంపురంకి చెందిన కాకి రమణ (27) ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు రమణకు విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం గొల్లలములగాం గ్రామానికి చెందిన భవానితో రెండేళ్లక్రితం వివాహం జరిగింది. అయితే అప్పటినుండి వీరిద్దరి మధ్య నిత్యం చిన్నచిన్న గొడవలు పడుతుండేవారు. ఏడాది నుంచి భవాని కన్నవారి ఇంటిదగ్గర ఉంటుంది. ఎన్నోసార్లు పెద్ద మనుషులు మాట్లాడినప్పటికి భవాని రావడానికి నిరాకరించడంతో మానసిక ఆవేదనకు గురైన రమణ ఆదివారం రాత్రి గొర్రెల శాలలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం తండ్రి గొర్రెల శాలలోకి వెళ్లి చూడగా కొడుకు ఉరి వేసుకొని ఉండటంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఎస్ఐ జి.రాజేష్ సంఘటన స్థలానికి చేరుకొని శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రం సర్వజన ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షులుగా త్రినాథరావు

త్రినాథరావు

ప్రజాశక్తి- పొందూరు

విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షులుగా తెండేల త్రినాథరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీకాకుళం సిఐటియు కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి పెద్దన్న, బాలకాశి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శి కె.రమణమూర్తి, కోశాధికారి బి.అప్పారావులను, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు, విఆర్‌ఎల గౌరవ అధ్యక్షులు అల్లు సత్యనారాయణ, వివిధ మండలాల విఆర్‌ల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు కుమార్ ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి

ఆల్‌ఇండియా యూనివర్సిటీ ఛాంపియన్ షిప్ తైక్వాండో పోటీలకు టెక్కలి క్రీడావికాశ్ కేంద్రం నుంచి పూడి కుమార్ ఎంపికయ్యారని కోచ్ నర్సిపురం శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ నెలలో రాజస్థాన్ రాష్ట్రం జంజూలో జరగనున్న 87కిలోల తైక్వాండో పోటీల్లో పాల్గొనున్నారని తెలిపారు. కుమార్ ఎంపిక పట్ల కోచ్ శేఖర్‌తో పాటు ఆదిత్యా ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వి.నాగేశ్వరరావు, జిల్లా క్రీడా శాఖాధికారి డాక్టర్ శ్రీధర్‌రావులు అభినందించారు.

మాట్లాడుతున్న ధర్మారావు

జీవిత ధ్రువపత్రాలను సమర్పించాలి

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారులు జనవరి, ఫిబ్రవరి నెలల్లో మాత్రమే సిఎఫ్‌ఎంఎస్ బయోమెట్రిక్ ద్వారా తమ జీవిత ధ్రువపత్రాలను సమర్పించాలని ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంకం ధర్మారావు అన్నారు. సోమవారం స్థానిక నవతా గ్రంథాలయంలో నిర్వహించిన పొందూరు, జి.సిగడాం మండలాల పెన్షన్‌దారుల సంఘ సమావేశంలో మాట్లాడారు. ప్రతినెల తొలి సోమవారం ఈ సమావేశాలను జరిపేందుకు తీర్మానించారు. డిసెంబర్ 17న జరిగే జాతీయ పెన్షన్‌దారుల దినోత్సవంలో సీనియారిటీ ప్రాతిపదికన 10మంది పెన్షన్‌దారులను సత్కరించేందుకు మరో తీర్మానాన్ని ఆమోదించారు. ఈ సమావేశంలో మండలశాఖ ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సూర్యప్రకాశరావు, దండా సూరిబాబు, వాండ్రంగి దామోదరరావు, వడగా సూర్యారావు, ఆట్ల మణిభూషణరావు, పి.కూర్మారావు, బి.జనార్ధనరావు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని మెళియాపుట్టి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం జగన్‌తోనే సంక్షేమ పథకాలు సాధ్యమవుతాయన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, మండల పార్టీ కన్వీనర్ పల్లి యోగి, జయమునిరావు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాయ్

సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సుదీర్ఘ కాలం పాటు ఆర్‌టిసిలో ఉద్యోగులుగా పని చేసి సంస్థ అభివృద్ధిలో భాగస్వాములుగా నిలిచిన విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విశ్రాంత ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వి.వి.కె.రాయ్ డిమాండ్ చేశారు. నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆర్.పి.రావు అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఎఫ్, పెన్షన్/హయ్యర్ పెన్షన్‌లో ఉన్న ఇబ్బందులను తొలగించి విశ్రాంత ఉద్యోగులను ఆదుకోవాలన్నారు. విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన సిఎల్ గ్రాడ్యూటీ చెల్లించాలని కోరారు. సూపర్ లగ్జరీ సర్వీసుల్లో ప్రయాణించడానికి అనుమతివ్వాలని కోరారు. దహన ఖర్చులు రూ.25 వేలకు పెంచడంతో పాటు శ్రీకాకుళంలో విశ్రాంత ఉద్యోగుల వైద్య సహాయానికి కార్పొరేషన్ ఆస్పత్రిలో ఉచిత వైద్యం పొందేందుకు అనుమతించాలని కోరారు. దూరప్రాంతాలకు రిజర్వేషన్ సదుపాయం కల్పించాలని, ఉచిత మందులు సక్రమంగా అందించాలని ప్రభుత్వానికి కోరారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు ఎం.పెంటయ్య, జామిప్రసాద్, భాగ్యలక్ష్మి, ఆర్.ఆర్.రావు, గౌరు రామారావు, ఎస్.ఎస్.ఆర్.శర్మ పాల్గొన్నారు.

పోస్టరును ఆవిష్కరిస్తున్న సన్యాసినాయుడు

ఆస్రా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబులిటీ అండ్ ఎవేర్నెస్ (ఆస్రా) ఆధ్వర్యాన ఈ నెల 24న న్యూఢిల్లీ కాన్స్టిట్యూషన్ క్లబ్లో జాతీయ స్థాయి వినియోగదారుల హక్కుల అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సంస్థ జిల్లా అధ్యక్షులు గంజి ఎజ్రా తెలిపారు. ఈ సదస్సుకు సంబంధించిన పోస్టరు, బ్రోచరును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, ఆర్.సన్యాసినాయుడు తన ఛాంబర్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు, సమాజంలో చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఆస్రా మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు జి.ఇందిరాప్రసాద్, గౌరవ సలహాదారులు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, అన్నెపు సత్యనారాయణ, కద్దాల శ్యామసుందర్, కె.పి.సారథి, లఖినేని రవికుమార్ పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న పిడిఎఫ్ సభ్యులు

మానవత్వం చాటుకున్న 'పిడిఎఫ్'

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పెద్దమురహరిపురం గ్రామానికి చెందిన నిరుపేద భద్రాచలం తారకేశ్వరరావు గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతుండడంతో ఆయనకు గ్రామస్తులు సోమవారం రూ. లక్షా 18లక్షలు ఆర్థికసాయం అందించారు. గుండెలో సిఆర్‌టి అనే పరికరం అమరిస్తే బతికే అవకాశం ఎక్కువని వైద్యులు చెప్పడంతో దానికి రూ.8లక్షలు ఖర్చు అవుతుందని స్పష్టం చేయడంతో స్థానిక పెద్దమురహరిపురం డెవలప్మెంట్ ఫోరం(పిడిఎఫ్) స్పందించి ఆర్థికసాయాన్ని అందించింది. సైనిక సేవా సంస్థ సభ్యులు మాజీ సైనికులు, విదేశాల్లో ఉన్న వలస కార్మికులు, గ్రామంలో ఉన్న ఉద్యోగులు, గ్రామస్తులు కలిసి ఆర్థికసాయం అందజేశారు. వైద్య ఖర్చులకోసం తారకేశ్వరరావుకు మరింత ఎక్కువ మంది సాయం చేయాలని పిడిఎఫ్ సభ్యులు కోరారు. ఈ సహాయానికి తారకేశ్వరరావు కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పిడిఎఫ్ ప్రతినిధులు తిరుపతిరావు, సింహాచలం, శ్రీనివాసరావు, చెన్నారావు, స్థానిక సర్పంచ్ గొరకల వసంతస్వామి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కలిశెట్టి గోపాల్, ఎంపిటిసి వసంతరావు, లోకనాథం గణేష్, అప్పలస్వామి, మాజీ ఎంపిటిసి దానేష్ మురళి ఉన్నారు.

ఆకట్టుకున్న శ్రీనివాస కళ్యాణం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సురభి కళాకారులచే శ్రీనివాస కళ్యాణం నాటకాన్ని సోమవారం ప్రదర్శించారు. ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్న ఈ నాటక ప్రదర్శన సూర్యనారాయణస్వామి దేవస్థానం పరిధిలోని ఇంద్ర పుష్కరిణి వద్ద గల వైజయంతి ఉత్సవ వేదిక వద్ద నిర్వహించారు. దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యాన ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. సురభి వేణు గోపాలరావు నేతృత్వాన ఈ ప్రదర్శన ఇస్తున్నారు.

బస్సులను తక్షణమే పునరుద్ధరించాలి

డిపో వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- పలాస

పిపిసి పెట్టి నిలిపి వేసిన బస్సులను తక్షణమే పునరుద్ధరించాలని పలాస డిపో ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎడి కుమార్ కోరారు. సోమవారం పలాస ఆర్‌టిసి డిపో ఎదురుగా భోజనవిరామ సమయంలో డిపో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంటిడబ్ల్యు యాక్ట్‌కు వ్యతిరేకంగా షెడ్యూల్ తక్షణమే నిలుపుదల చేయాలని, ఏ షెడ్యూల్స్ మారిన ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు సంఘంగా మేజర్ యూనియన్ అయిన ఎంప్లాయిస్ యూనియన్‌కు తెలియపర్చాలన్నారు. డిపోలో మంచినీరు సదుపాయం కల్పించాలని, కవిటిలో సులభ్‌కాంప్లెక్సు ఏర్పాటు చేయాలని కోరారు. పలాస నుంచి శ్రీకాకుళంకు (ఒటి) షెడ్యూల్డ్ సర్వీసు రోడ్లులో వెళ్లడం వలన చాలా ఆలస్యమవుతుందని, జాయింట్ రూట్ సర్వే చేసి గంటలను సరిచేయాలన్నారు. పల్లెవెలుగు సర్వీసుకు విశ్రాంతి గదిని ఏర్పాటు చేయాలని, ఇచ్ఛాపురం బహుదానదిపై వంతెన పాడైనందున బెల్లుపడ మీదుగా ఇచ్ఛాపురం బస్సులు వెళున్నాయని, ఒక ట్రిప్‌కు 3 కిలోమీటర్లు అదనంగా వస్తుందని, ఆ రూటు కిలోమీటర్లు సరి చేయాలన్నారు. అన్ని బస్సులకు పరికరాలు అందజేయాలని, దూరప్రాంతం వెళ్లే బస్సులకు ఎయిర్ జాకీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాహనాల కండీషన్లు మెరుగుపర్చాలని, అన్ని బస్సులకు తగ్గట్టుగా స్పేర్స్ తెప్పించాలని కోరారు. తమ సమస్యలు తక్షణమే అధికారులు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎం.ఎ.రాజు, కోశాధికారి పి.ఎల్ నారాయణలతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్రంలో వైసిపి అధికారం చేపట్టిన నాలుగున్నర ఏళ్లలో దళితులపై దాడులు పెరిగాయని, వీటిని అరికట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుతూ టిడిపి ఎస్‌సి సెల్ విభాగం జిల్లా అధ్యక్షులు మట్ట పురుషోత్తం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. దళితుల ఓట్లతో ఆధికారం చేపట్టిన వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దళితులపై దాడులు చేయడమే కాకుండా మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రశ్నించిన వారిపై అక్రమంగా కేసులు నమోదు చేస్తూ లాకప్‌డెత్‌లకు పాల్పడుతున్నారన్నారు. వీటిని అరికట్టి దళితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అంతకుముందు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేసి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి బసవల అప్పలస్వామి, తెలుగు యువత కార్యదర్శి రెయ్యి ప్రీతీష్‌చంద్, టెక్కలి మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు పేర మురళీ, పట్టణ అధ్యక్షులు కోళ్ల లవకుమార్ పాల్గొన్నారు.

అలరించిన పగటి వేషాలు

కోటబొమ్మాళి : పగటివేషాలతో ఆకట్టుకున్న స్థానికులు

ఆమదాలవలస : పగటి వేషాలతో ఆకట్టుకుంటున్న యువత

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలం హరిశ్చంద్రపురం పంచాయతీ చిన్న హరిశ్చంద్రపురం గ్రామంలో గౌరిపౌర్ణమి నవరాత్రులు ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం గ్రామస్థులు వేసిన పగటివేషాలు పలువురుకి అకట్టుకున్నాయి. ముఖ్యంగా ఈ పగటి వేషాలను చిన్నారులు వింతగా తిలకించారు. అంతరించి పోతున్న కలలను భావితరాలకు అందించే విధంగా పాత అచారాలు, పూరాణ ఇతిహాసాలను తెలియజేస్తూ ఈ వేషాధారణలు యువతరానికి ఎంతగానో చైతన్యపరిచాయి. గ్రామానికి చెందిన రోణంకి చలపతిరావు, బ్రహ్మదేవుడు వేషాధారణతో పాటు, కోట రమణమూర్తి, బగాది ఈశ్వరరావు, దుంపల వెంకట రమణలు అలనాటి పాత్రలు పోషిస్తూ కట్టు, బొట్టు విధానాలను వీధుల్లో తిరుగుతూ తెలియజేశారు.

ఆమదాలవలస :మండలంలోని పలు గ్రామాల్లో ప్రారంభమైన గౌరీపౌర్ణమి నందన్న వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. వివిధ రకాల వేషాలతో పలువురిని ఆకట్టుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో గౌరీవ్రతం రోజు నుండి నందన్నతో పాటు వరిదుబ్బుతో గౌరీదేవిని ఏర్పాటు చేసిన రోజు నుండి తొమ్మిది రోజులు నాగుల చవితి వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఈ వేడుకల్లో భాగంగా పగటిపూట వీధివేషాలు వేస్తూ గ్రామాల్లో ప్రదర్శనలు ఇవ్వడంతో పాటు రాత్రివేళ నాటక ప్రదర్శనలు జరుగుతుంటాయి. సోమవారం మండల కేంద్రమైన సరుబుజ్జిలిలో కొందరు యువకులు వీధివేషాలు వేసుకొని పాటలు పాడుకుంటూ ప్రదర్శించిన తీరు పలువురిని ఆకట్టుకున్నాయి. మండలంలో సరుబుజ్జిలి, పాతపాడు, పెద్ద సవలాపురం, రొట్టవలస, కొత్తకోట, షలంత్రి, కొండవలస, వీరబద్రాపురం, మతలబుపేట గ్రామాల్లో ఈ ఏడాది గౌరీపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

పలువురికి ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు : ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కంబాలరాయుడు పేట గ్రామానికి చెందిన పత్రి ఆదిలక్ష్మి కుమారుడు కేన్సర్‌తో బాధపడుతూ విశాఖపట్నంలో కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ కుటుంబం ఆర్థిక పరిస్థితుల కారణంగా వైద్యం చేయించుకోవడానికి ఇబ్బందులు పడుతుంది. విషయం తెలుసుకున్న పింగళి వెంకన్న యూత్ సభ్యులు స్పందించి రూ. 10 వేలు ఆర్థికసాయం సోమవారం ఆ కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో గుంటు బాబూరావు, కారి వెంకటరావు, వాడు గురునాధరావు, ఉప్పాడ మూర్తి, దుమ్ము మాధవరావు, మైలపల్లి శంకర్, వంక పుణ్యవతి, మైలపల్లి రాజులమ్మ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలో చీపురుపల్లి గ్రామంలో శనివారం విద్యుతాఘాతానికి కొమ్ము దాలమ్మ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న విద్యావేత్త, పాతపట్నం నియోజకవర్గ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు సోమవారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబానికి పరామర్శించారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన కారణాలను స్థానికులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబాలకు తన వంతు సాయంగా నిత్యవసర సరుకులు, ఆర్థికసాయాన్ని అందించారు. ఈయనతో పాటు స్థానిక సర్పంచ్ యవ్వరి ఈశ్వరరావు, మాజీ ఎంపిటిసి సింహాద్రి, సరాలి సర్పంచ్ పడాల షణ్ముఖరావు ఉన్నారు.

అమరుల బాటలో నడుద్దాం

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వజ్రపుకొత్తూరు : అమరవీరుల పోరాటం స్ఫూర్తిగా పోరాట బాటలోనే నడుద్దామని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అన్నారు. శ్రీకాకుళ సాయుధ పోరాట సమర యోధుల స్మృతికి నివాళిగా ఈ నెల 22న మర్రిపాడులో నిర్వహించే 45వ స్మారకసభను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం మర్రిపాడు అమరవీరుల స్మారక స్థూపం వద్ద వివిధ ప్రజాసంఘాల నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూస్వామ్య వ్యవస్థ రద్దు కోసం, సమ సమాజం నిర్మాణం కోసం, భారత విప్లవోద్యమ నిర్మాణంలో అసువులు బాసిన అమర వీరులకు కామ్రేడ్ తామాడ గణపతి వర్ధంతి రోజున నివాళ్లర్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, పిఒడబ్ల్యూ జిల్లా నాయకులు పోతనపల్లి కుసుమ, రైతు కూలీ సంఘ నాయకులు మాధవరావు, పివైఎల్ నాయకులు జగన్, ఇఫ్టూ నాయకులు గోపి, తాతారావు, లక్ష్మయ్య, కామరాజు, కామేశ్వరరావు, సింహాద్రి, అప్పయ్య పాల్గొన్నారు.

న్యూస్ క్లిక్ జర్నలిస్టులను విడుదల చేయాలి

ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి- పర్లాకిమిడి

గజపతి జిల్లా పర్లాకిమిడి పట్టణంలో కాలేజీ కూడలి నుండి సిపిఐ(ఎం) కార్యాలయం వరకు న్యూస్ క్లిక్ జర్నలిస్టుల అరెస్టును వ్యతిరేకిస్తూ అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్), వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజా సంఘలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి దొండపాణి రైతో, ఎఐకెఎస్ జిల్లా కార్యదర్శి ముచ్చి బంగారయ్య, సభ్యురాలు శకుంతల రైతో, ఖేత్ మజ్ దూర్ సంఘ్, నాయకులు గోకులదల్ బెహరా, దళిత నాయకులు మొహిత మిషాల్, మానస కుమార్ జనా, సిఐటియు నాయకులు శ్రీను బెహరా, ఆర్.చంద్రశేఖర్ దేవ్, అల్లేనా భాస్కరరావు పాల్గొన్నారు. ఢిల్లీలో అరెస్టైన న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకులు, జర్నలిస్ట్ ప్రబీర్ పురకాయస్థ, సంస్థ హెచ్‌ఆర్ అమిత్ చక్రవర్తిలను బేషరతుగా విడుదల చేయాలని, వారిపై ఉన్న కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు స్వాదీనం చేసుకొన్న లాప్‌టాప్‌లు, మొబైళ్లతో పాటు విలువైన సమాచారాన్ని భద్రంగా వారికి అందజేయాలని వారు డిమాండ్ చేశారు.

వినియోగదారుల హక్కుల సంరక్షణకు కృషి

పుస్తకాన్ని అందజేస్తున్న జోగినాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మేలుకో వినియోగదారుడా.. మేలుకో అంటూ కొంతకాలంగా వినియోగ దారుల హక్కుల పరిరక్షణకు అహర్నిశలు కృషి చేస్తున్న ఆసరా సంస్థ ఈ నెల 24న ఢిల్లీలో సదస్సు నిర్వహిస్తుందని వాకర్సు ఇంటర్నేషనల్ ప్రతినిధులు శాసపు జోగినాయుడు, ఇందిరా ప్రసాద్‌లు వెల్లడించారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన సోమవారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జోగినాయుడు మాట్లాడుతూ వినియోగదారుల మోశానికి గురి కాకుండా కాపాడే బాధ్యత స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు, వినియోగ దారుల హక్కుల కోసం పాటుపడాలన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు గొర్లె వాసుదేవరావు, ఎం.మల్లిబాబు, జి.ఆనందరావు, గేదెల లక్ష్మి, ఎం.మోహన్, గుడ్ల జగ్గారావు, బొడ్డేపల్లి ప్రసాదరావు, నల్లబాటి కృష్ణమూర్తి, సూర్యారావు పాల్గొన్నారు.

కుక్కకు రొమ్ము కేన్సర్ ఆపరేషన్

ప్రజాశక్తి- పలాస

నందిగాం మండలం ఉయ్యాలపేట గ్రామానికి చెందిన మధు అనే వ్యక్తి లేబ్ డాగ్ (కుక్క)ను పిప్పి అనే పేరు పెట్టుకొని గత 11 ఏళ్లుగా పెంచుకుంటున్నారు. ఇటీవల కుక్క అనారోగ్యం పాలవ్వగా పశు సంవర్ధకశాఖ ఎడిఇ డాక్టర్ మట్ట రవికృష్ణకు చూపించారు. పిప్పికి రొమ్ము క్యాన్సర్ ఉన్నట్లు మూడు నెలల క్రితం గుర్తించారు. అప్పట్లోనే రొమ్ము క్యాన్సర్‌కు ఆపరేషన్ చేసి విజయవంతంగా కణతలను తొలగించారు. అయితే ఈ ఆపరేషన్ నిర్వహిస్తుండగా దాని ప్రక్కనే మరో భారీ కణత ఉన్నట్లు "గుర్తించి దానికి పరీక్షలు నిర్వహించగా ప్రమాదకరమైన రొమ్ము క్యాన్సర్ కణతగా గుర్తించారు. అప్పట్లో ఆపరేషన్ చేయడానికి కుక్కకి ఆరోగ్యం న వా క రి ం చ క పో వ డ ం తో ఆదివారం సాయంత్రం నుంచి ఐదు గంటల పాటు శ్రమించి ఆపరేషన్ చేసి 750 గ్రాముల పరిమాణంలో ఉన్న క్యాన్సర్ గడ్డను తొలగించారు. ప్రస్తుతం పిప్పి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యాధికారి తెలిపారు. ఆపరేషన్ చేసి క్యాన్సర్ కణతలు తొలగిండం అరుదైనదిగా వైద్యాధికారులు చెబుతున్నారు.

హిమోగ్లోబిన్ పరీక్షలు

ప్రజాశక్తి- పొందూరు

మండలం కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కింతలి ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం హిమోగ్లోబిన్ పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన సుమారు 95 మంది విద్యార్థులకు పరీక్షలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సునీత, ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.వి.రమణ, వైద్య సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.